

పీతలవానిపాలెంలో కొలువుతీరిన దుర్గాదేవిని దర్శించుకుంటున్న మహిళలు



పోలమాంబ ఆలయంలో సంకీర్తలు ఆలపిస్తున్న మహిళలు



పోలమాంబను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

చల్లనితల్లి.. ప్రణమిల్లి

- ఘనంగా ప్రారంభమైన శరన్నవరాత్రి వేడుకలు
- భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు, చండీ హోమాలు



విద్యుద్దీపాలంకరణలో పీతలవానిపాలెం

ఆరిలోవ: శరన్నవరాత్రి ఉత్సవాలు తూర్పు నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేక మండపాల్లో దుర్గమ్మ కొలువుదీరింది. ఆరిలోవ, దుర్గాబజార్, టీఐసీ పాయింట్, పెదగదిలి, హనుమంతవాక ప్రాంతాలలో ఏర్పాటు చేసిన మండపాలు ఆకట్టుకుంటున్నాయి. జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దూలి రఘు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవ మండపం కనువిందు చేస్తోంది. దుర్గాదేవి ఆలయం మాదిరిగా సెట్ వేశారు. అందులో 18 అడుగుల దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 9 రోజుల పాటు ప్రత్యేక పూజల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం దుర్గాదేవిని పెదగదిలి, చినగదిలి తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. హనుమంతవాక వద్ద విజయదుర్గా కాలనీలో విజయదుర్గాదేవి ఆలయం, పాత ఆరిలోవలో దుర్గాలమ్మ గుడి, దుర్గాబజార్‌లో దుర్గాదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అమ్మవార్లను నూతన వస్త్రాలతో అలంకరించి, క్షీరాభిషేకం చేశారు.



పెదగదిలిలో 18 అడుగుల అమ్మవారి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని పోలమాంబ ఆలయం, ఏయూ అవుట్‌గేట్ వద్దనున్న లలితా సుందరేశ్వర పీఠంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. పోలమాంబ ఆలయంలో అమ్మవారి స్వర్ణకవచాలంకృత శ్రీపోలమాంబగా దర్శనమిచ్చారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంకీర్తన, భజన కార్యక్రమాలు, సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం కుంకుమ పూజలు, చండీ హోమంలో భక్తులతో తరించారు. పోలమాంబ అమ్మవారిని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, దేవదాయ శాఖ ఉప కమిషనర్ సుజాత తదితరులు దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేసిన ఏర్పాట్లను ఈవో కె.గాయత్రి పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాదం, మంచినీరు పంపిణీ చేశారు. ట్రస్టీ బోర్డ్ చైర్మన్ శంకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పెదగదిలిలో ఆకట్టుకుంటున్న మండపం

➡ లలితా పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు పంచామృత అభిషేకంతో శ్రీకారం చుట్టారు. తొలి రోజు కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, చండీహోమం, చండీ శప్తశతి పారాయణ, శ్రీ చక్రనవరాత్రి ఆవరణార్చన నిర్వహించారు. సాయంత్రం నక్షత్ర దీపాలంకరణ సేవ, మంగళహారతితో తొలిరోజు కార్యక్రమాలు వైభవంగా ముగిశాయి. అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు.

మద్దిలపాలెం : శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెంలో విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. గ్రామ కూడలిలో భారీ సెట్టింగ్‌లో దుర్గాదేవి అమ్మవారిని ప్రతిష్ఠించారు. తొలి రోజు గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి విశేష పూజలు చేశారు. పిఠాపురం కాలనీ ఆటోస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. మద్దిలపాలెం, హెచ్‌బీ కాలనీ, ఇసుకతోట ఆటో స్టాండ్ల వద్ద దుర్గాదేవి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

జీవీఎంసీలో..

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో చైర్మన్ రొంగలి జగన్నాథం, అధ్యక్షుడు గొంప చంద్రమౌళి కార్యవర్గ సభ్యులు పాల్గొని దుర్గాదేవికి పూజలు నిర్వహించారు. కార్యదర్శి రంధి సాధూరావు, ఉపాధ్యక్షుడు పీపీ రాజు, బి. రామానాయుడు, ఎం. సంజీవరెడ్డి, జి. దేముడు, అల్లు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి



లలితా పీఠంలో లలితా త్రిపురసుందరిగా..



అమ్మవారిని పూజిస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

బాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో భూలోకమాత

మద్దిలపాలెం: రేసపువానిపాలెంలోని భూలోకమాత అమ్మవారు తొలి రోజు ఆదివారం బాల త్రిపుర సుందరిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి వేడుకల నిర్వహణకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



భూలోకమాతకు బాల త్రిపుర సుందరిదేవీ అలంకరణ

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నారు. పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు.

తీరంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



జోడుగుళ్లపాలెం తీరంలో గుర్తు తెలియని మృతదేహం

ఆరిలోవ: జోడుగుళ్లపాలెం వద్ద మృతదేహం కొట్టుకొచ్చినట్టు స్థానికులు ద్వారా ఆరిలోవ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు ప్యాంట్, షర్టు జేబుల్లో వివరాలకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయసు 30–35 ఏళ్లు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడుకి సంబంధించిన బంధువులు ఎవరైనా పోలీసులను సంప్రదించాలని సీఐ సోమశేఖర్ తెలిపారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనలు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీసాయి బాబా ఆలయంలో ఆదివారం దేవీ నవరాత్రులు, ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం ఉదయం 6 గంటలకు దుర్గా హోమం, మహాలక్ష్మి దుర్గమ్మవారికి అభిషేకం చేశారు. ఉదయం 6 గంటలకు ప్రసన్న వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహివాంచారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ జరిగింది. సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. 7 గంటలకు వెంకన్న తిరువీధి అత్యంత వైభవంగా జరిగింది. చైతన్య బ్రదర్స్ వారి శిష్య బృందం నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనల గానాలహరి కార్యక్రమం అలరించింది. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మిస్సెస్ వైజాగ్-2023 పోటీలకు విశేష స్పందన



మిస్సెస్ వైజాగ్-2023 పోటీల విజేతలు

బీచ్ రోడ్డు: ఈ ఏడాది నిర్వహించిన మిస్సెస్ వైజాగ్–2023కు నగర వాసుల నుంచి విశేష స్పందన లభించిందని హేంప్‌షైర్ వాసు తెలిపారు. ఆదివారం సిరిపురంలోని ఒక హోటల్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు 167 మంది మహిళలు హాజరయ్యారని, వారిలో 26 మందిని సెమీ ఫైనల్స్‌కు ఎంపిక చేశామన్నారు. ఈ నెల 8న జరిగిన గ్రాండ్ ఫైనల్స్‌లో విజేతగా సాక్షి బజాజ్, ఫస్ట్ రన్నర్‌గా లక్కీ, సెకెండ్ రన్నర్‌గా సబిత నిలిచారన్నారు. సబ్ టైటిల్స్‌లో మిస్సెస్ ర్యాంప్ వాక్‌గా అంజు, చార్మింగ్ స్మైల్‌గా గాయత్రి, బ్యూటీఫుల్ స్కిన్‌గా దీపిక, ఫొటోజెనిక్‌గా లలిత, బ్యూటీఫుల్ ఐస్‌గా అధితి నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో విజేతలు, టైటల్స్ విన్నర్స్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుడి అరెస్ట్



నిందితుడు పచ్చిగోళ్ల ప్రకాష్

అక్కిరెడ్డిపాలెం: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 69వ వార్డు నాతయ్యపాలెంలో పచ్చిగోళ్ల ప్రకాష్ అనే వ్యక్తి కొంత కాలంగా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. శనివారం పక్కా సమాచారంతో నగర సీపీ డాక్టర్ రవిశంకర్, స్పెషల్ బ్రాంచి ఏసీపీ నాగేంద్రుడు ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ త్రినాథరావు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి, ప్రకాష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ఒక ల్యాప్‌టాప్, 2 మొబైల్ ఫోన్లు, బెట్టింగ్ నిర్వహణ సమాచారం ఉన్న 3 పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును గాజువాక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

18న చలో కలెక్టరేట్



మాట్లాడుతున్న పడాల గోవింద్

మద్దిలపాలెం : ఆటో డ్రైవర్ల జీవనానికి ఆటంకంగా మారిన జీవో నంబర్ 21, 31ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 18న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఏఐటీయూసీ ఆటో యూనియన్ అధ్యక్షుడు పడాల గోవింద్ తెలిపారు. 16వ వార్డులోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్ల భద్రతకు సంక్షేమ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. ఆటోల పార్కింగ్‌కు నగరంలో స్థలాలు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు మధురెడ్డి, లంక గోవింగ్, కెల్లా రమణ, అడ్డూరి శంకర్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యం

సీతమ్మధార: అఖిల భారతీయ విద్యా భారతి శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో బీవీకే విద్యా సంస్థలు ఆతిథ్యమిస్తున్న 34వ జాతీయ బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ ముగింపు పోటీలు ఆదివారం సీతమ్మధారలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో నిర్వహించారు. వీటిని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రమశిక్షణకు మారుపేరైన విద్యా భారతి, బీవీకే విద్యా సంస్థల విద్యార్థులు క్రీడల్లో రాణించి దేశానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రపంచ వ్యాప్తంగా పలు క్రీడల్లో భారత్ మొదటి స్థానంలో ఉందన్నారు. విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాంస్కృతిక ఉత్సవం అదిరింది



వేదికపై విద్యార్థినుల సందడి

ఏయూ క్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ) ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల మూడు రోజుల సాంస్కృతిక సమ్మేళనం శాస్వత్ 2కె3 అదిరింది. ఆంధ్ర విశ్వ విద్యాలయం వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా జరిగిన ఈ వేడుకను ఐఐపీఈ డైరెక్టర్ ఆచార్య శాలివాహన్ ప్రారంభించారు. విద్యార్థులు తమ కళా ప్రతిభను వేదికపై ప్రదర్శించారు. ఆట పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రామ్‌పాల్ ద్వివేది, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య సి.వి. రావు, కన్వీనర్ డాక్టర్ రవికుమార్ సోన్‌వాని, స్టూడెంట్ జనరల్ సెక్రటరీ రోహిత్ పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థి

భారతీ స్కూల్‌కు అపుస్మా అవార్డు

ఆరిలోవ: ఆరిలోవలో భారతీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు అపుస్మా(ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్–అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) స్కూల్ జ్యూరీ చాంపియన్‌షిప్ అవార్డు లభించింది. ఈ నెల 14న న్యూఢిల్లీలో నేషనల్ ఎడ్యుకేషన్ వరల్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ జ్యూరీ అవార్డుల ప్రదానోత్సవంలో నేషనల్ ఇండిపెండెట్ స్కూల్స్ అసోసియేషన్(నిసా) అధ్యక్షుడు కుల భూషణ్‌శర్మ, రాష్ట్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి ఈ అవార్డును తనకు అందించినట్లు భారతీ స్కూల్ కరెస్పాండెంట్ ఎం.వి.రావు ఆదివారం తెలిపారు. 2023–24 సంవత్సరంలో ఇండియా స్కూల్స్ ర్యాంకింగ్‌లో నేషనల్ జ్యూరీ అవార్డులకు అపుస్మా దరఖాస్తులు ఆహ్వానించిందన్నారు. అందులో భాగంగా బడ్జెట్ స్కూల్స్ ర్యాంకింగ్‌లో తమకు అవార్డు లభించిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.



న్యూఢిల్లీలో పురస్కారం అందుకుంటున్న భారతీ స్కూల్ కరెస్పాండెంట్ ఎం.వి.రావు

నిప్పంటుకుని మూడు వాహనాలు దగ్ధం

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి తాటిచెట్లపాలెం రామాలయం వీధిలో శనివారం అర్ధరాత్రి పార్క్‌చేసి ఉన్న మూడు వాహనాలకు నిప్పంటుకుంది. ఈ సంఘటనపై బాధితుడు ఆదివారం ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలిలా.. నీలాచలం బగాది అనే వ్యక్తి తాటిచెట్లపాలెం రామాలయం వీధిలో 20 ఏళ్లుగా నివసిస్తున్నాడు. ఎప్పటిలాగే తన ఏపీ39 యూఎస్ 6983 నంబర్ గల కారును శనివారం రాత్రి రామాలయం వెనుక భాగంలో పార్క్ చేశాడు. సుమారు అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పక్కనే ఉన్న చెత్త కుప్పకు నిప్పంటుకుని అక్కడే ఉన్న రెండు బొలెరో వాహనాలతోపాటు అతడి కారుకు మంటలు వ్యాపించి దగ్ధమయ్యాయి. కారు ఎడమ భాగం కాలిపోయి దెబ్బతింది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సంఘటనపై పోలీసులు పరిశీలిస్తున్నారు.



తాటిచెట్లపాలెంలో దగ్ధమవుతున్న వాహనాలు

బైకు ఢీకొని వ్యక్తికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని వెనుక నుంచి స్కూటీ ఢీకొనడంతో గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎన్ఏడీ దరి పీఎఫ్ ఆఫీస్ ప్రాంతంలో నివసిస్తున్న కె.కృష్ణ అక్కయ్యపాలెంలోని ఓ హౌసింగ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో సైట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం బైక్‌పై ఎన్ఏడీ నుంచి అక్కయ్యపాలెం వెళ్తున్న క్రమంలో కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలోకి వచ్చేసరికి అతడి బైకులోని పేపర్లు కింద పడిపోయాయి. బైకు పక్కకు నిలిపి పేపర్లను తీసుకుని తిరిగి వస్తుండగా.. అటుగా వస్తున్న ఓ మహిళ స్కూటీపై వచ్చి ఢీకొనడంతో సదరు వ్యక్తి కాలికి బలమైన గాయమైంది. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి నేతృత్వంలో ఏఎస్ఐ రాజారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'నేవీ సివిలియన్ ఆఫీసర్స్' నూతన కార్యవర్గం

సీతంపేట: ఇండియన్ నేవీ సివిలియన్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఈస్టర్న్ నేవల్ కమాండ్ డివిజన్ సర్వసభ్య సమావేశం ఆదివారం రామాటాకీస్ రోడ్డులోని వేదిక ఫంక్షన్ హాల్లో జరిగింది. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ టి.ఎస్.రాయ్, భవేశ్‌కుమార్, వైద్యాధికారి డాక్టర్ కె.సుజిత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి అసోసియేషన్ పనితీరు, ఆర్థిక నివేదికలను సభకు వివరించారు. 2023–25 కాలానికి ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా జి.ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శిగా పైలా శ్రీనివాస్, కోశాధికారిగా బి.వి.నరసింహం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.రమేష్‌కుమార్, బి.సర్దార్, కె.వి.ఎస్.ఎన్.రాజు ఎన్నికయ్యారు. డైరెక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ సైంటిఫిక్ ఆఫీసర్ సి.ప్రవీణ్‌కుమార్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

రెండు కార్లు ఢీకొని ఐదుగురికి గాయాలు

అక్కిరెడ్డిపాలెం: మలుపు తిరుగుతున్న కారును వేగంగా వస్తున్న మరో కారు ఢీకొట్టిన ఘటన విశాఖ డెయిరీ పార్లర్ ఎదుట ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టౌన్ నుంచి వస్తున్న కారు నాతయ్యపాలెం వైపు వెళ్లేందుకు మలుపు తిరుగుతోంది.. ఈ కారులో ముగ్గురు మహిళలు, డ్రైవర్ ఉన్నారు. ఇదే సమయంలో పరవాడ నుంచి సింహాచలం వైపు వెళుతున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ కారులో ఏడుగురు ప్రయాణిస్తున్నారు. వీరిలో ముగ్గురితో పాటు ఓ చిన్నారికి గాయాలయ్యాయి. మలుపు తిరుగుతున్న కారులో ఒక మహిళ గాయపడింది. వీరిని షీలానగర్‌లో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గాజువాక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరే రామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో అలంకరించారు.

గైస్‌లో ఇండోర్ గేమ్స్ ప్రారంభం



టేబుల్ టెన్నిస్ గేమ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ కేవీ రమణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లో ఆదివారం ఇండోర్ గేమ్స్ మొదలయ్యాయి. విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి కల్పించేలా టేబుల్ టెన్నిస్ బోర్డును గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ ప్రారంభించారు. దీనికి రూ.26,000 ఖర్చు చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు టెన్నిస్ క్రీడలో పాల్గొని విద్యార్థులను ఉత్సాహ పరిచారు. డిపార్ట్‌మెంట్ హెడ్‌లు బీవీ లక్ష్మణరావు, జయప్రకాష్‌రెడ్డి, డి.దామోదర్, ప్రశాంతకుమారి, ఇన్‌చార్జి పీడీ బి.హెచ్.ప్రదీప్‌కుమార్, స్టూడెంట్ అడ్వైజర్ రామాజంనేయులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం..

ఆదర్శనీయుడు అబ్దుల్ కలాం

ఏయూ క్యాంపస్: సాధారణ వ్యక్తిగా జన్మించినా తన అకుంఠిత పట్టుదల, వ్యక్తిత్వంతో దేశం గర్వించే వ్యక్తిగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎదిగారని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో ఆయన చిత్ర పటానికి రిజిస్ట్రార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్టీఫెన్ మాట్లాడుతూ నేటి తరానికి అబ్దుల్ కలాం జీవితం ఒక ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం కూడా కలాంకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసి, సత్కరించిందన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, డీన్‌లు ఆచార్య కె.బసవయ్య, ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, వర్సిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరిలోవ: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని ఆదివారం జీవీఎంసీ 12వ వార్డు నెహ్రూనగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, బాలరాజు, అర్జున్, మోహన్, కిశోర్ పాల్గొన్నారు.



కలాం చిత్ర పటానికి పూలమాల వేస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్



నెహ్రూనగర్‌లో కలాం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విశాఖ మరింత అభివృద్ధి

మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

గోపాలపట్నం : విశాఖ నగరం సర్వాంగ సుందరంగా మారబోతోందని మున్సిపాల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. అధికార పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం ఆయన విశాఖ వచ్చారు. విమానాశ్రయంలో మంత్రిని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పార్టీ నాయకులు, అధికారులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో విశాఖ మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా బీచ్ శాండ్ క్లీనింగ్ కోసం రూ.15 కోట్లతో ప్రాజెక్టును చేపట్టబోతున్నామన్నారు. విశాఖ తీరంలో ఉన్న బీచ్‌లు శుభ్రం చేసే పని చేపడుతున్నామన్నారు. ఈ ప్రాజెక్టును సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభిస్తారన్నారు.



మంత్రి ఆదిమూలపు సురేష్‌తో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్